

త్యాగం మాది.. నీళ్లు హైదరాబాద్‌కా?

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ నిర్మాణంలో భూములు త్యాగం చేసింది దుబ్బాక ప్రాంతమని, తమకు నీళ్లు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. ప్రాజెక్టు నిర్మాణంలో పాడైన రోడ్ల మరమ్మతు నిధులను మళ్లించిన ప్రభుత్వం తిరిగి నిధులు విడుదల చేయకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆదివారం దుబ్బాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గంలోని గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, మరమ్మతుకు పైసా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. నిధులు ఇవ్వకుంటే దేశంలో ఎక్కడా లేనివిధంగా దుబ్బాక నుంచే పెద్దఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో డబ్బులు, బహుమతులు పంపిణీ చేసి విజయం సాధించిన కాంగ్రెస్, పంచాయతీ ఎన్నికల్లోనూ ఇందిరమ్మ చీరల పేరుతో రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. రేవంత్ సర్కార్ రెండేళ్లుగా బతుకమ్మ చీరలు ఇవ్వకుండా కేవలం మహిళా సంఘాలకు మాత్రమే పరిమితం చేసి, ఎన్నికల సమయంలో పంపిణీ చేస్తోందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు సరైన బుద్ధి చెప్పుతారని ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

కరుణామయుడికి కోత కాలపు కృతజ్ఞతార్పణ

కొత్త పంటలు సమర్పించిన రైతులు

భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి పరిసరాలు

7



మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో మంత్రి దామోదర్‌తో కలిసి పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చిన నిర్మలా జగ్గారెడ్డి



టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డికి ఇందిరా మహిళాశక్తి చీరను అందజేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చినమాట నెరవేర్చడమే కాంగ్రెస్ తత్వమన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగిన ఇళ్లు బాగుపడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సమష్టిగా సంక్షేమ పథకాలన్నింటిలోనూ మహిళలనే లబ్ధిదారులుగా చేర్చుతూ కోటీ మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఇందిరమ్మ చీరలు కొందరికే పంపిణీ చేస్తున్నారని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అర్థరహితమన్నారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పది నుంచి పదిహేను మంది మహిళలు కలిసి పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపనలో మహిళలు రాణించేందుకు అవసరమైన సహాయం అందజేస్తానని నిర్మలాజగ్గారెడ్డి తెలిపారు.



ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీలో మంత్రి దామోదర్‌తో కలిసి పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

ఫేక్ ట్రేడింగ్, పార్ట్‌టైంజాబ్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి : మెదక్ ఎస్పీ



మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫేక్ ట్రేడింగ్, ఐపీవో, పార్ట్‌టైంజాబ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. తన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న తరుణంలో సైబర్ నేరాలు కూడా వేగంగా పెరుగుతున్నాయన్నారు. చిన్న పొరపాట్లు కూడా పెద్ద ఆర్థిక నష్టాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు ఇంటర్నెట్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ట్రేడింగ్, బ్యాంకింగ్ సేవలు వినియోగించే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. తెలియని లింకులు, యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని, బ్యాంక్ ఓటీపీ, వ్యక్తిగత వివరాలు ఎవరికీ ఇవ్వకూడదని సూచించారు. ఆఫర్లు, ఆకర్షణీయమైన ఉద్యోగ ప్రకటనలు నమ్మవద్దని అన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీ

గుజరాత్‌కు తరలిస్తున్న 217 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పటాన్‌చెరు నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్‌బియ్యాన్ని పటాన్‌చెరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మహేశ్వరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా నుంచి ఔటర్ రింగరోడ్డు మీదుగా 217 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో లారీ గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు వెళ్తున్నది. ముత్తంగి వద్ద ఔటర్ రింగురోడ్డు టోల్‌గేట్ వద్ద పోలీసులు లారీని పట్టుకుని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సివిల్‌సప్లై ఉపతహసీల్దార్ అనూప్‌దేవానంద్ ఫిర్యాదు మేరకు రేషన్‌బియ్యాన్ని విక్రయించిన వైద్యనాథ్, లారీ యజమాని బంగా ఆషిక్, డ్రైవర్ ఇమ్రాన్‌ఖాన్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని గోదాముకు తరలించారు.



గండి పడి కొట్టుకుపోయిన అల్లాదుర్గం మండల కేంద్రంలోని బట్టికుంట చెరువు

కడ గండ్లు

వర్షాలకు దెబ్బతిన్న జలాశయాలు

- మెదక్ జిల్లాలో 63 చెరువుల కట్టలు ధ్వంసం
- మరమ్మతులకు రూ. 44 కోట్లతో ప్రతిపాదనలు
- ప్రభుత్వం నుంచి ఇప్పటికీ మంజూరు కాని నిధులు
- జిల్లావ్యాప్తంగా చెరువుల ఆయకట్టు లక్షన్నర ఎకరాలు
- యాసంగి సాగుపై ప్రభావం

మెదక్ జిల్లాలో లక్షన్నర ఎకరాల చెరువుల ఆయకట్టుకు భారీ వర్షాల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లావ్యాప్తంగా 63 చెరువులకు గండ్లు పడటం, కట్టలు తెగిపోవడంతో యాసంగి సాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. మరమ్మతుల కోసం రూ.44 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేసినా, ఇప్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మెదక్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 1,881 చెరువులు నీటిపారుదలశాఖ పర్యవేక్షణలో ఉన్నాయి. వానాకాలం సీజన్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువులన్నీ పొంగిపొర్లాయి. అయితే, స్థాయికి మించి నీరు చేరడంతో అనేక చెరువులకు గండ్లు పడటం, కట్టలు తెగిపోవడం, పెద్ద చెరువులు, జలాశయాల గేట్లు కొట్టుకుపోవడం వంటి నష్టం వాటిల్లింది. సమయానికి మరమ్మత్తులు చేపట్టకపోవడం వల్ల చాలా చెరువుల్లో నీరు వృథా అయ్యింది. ఫలితంగా, చెరువులు, కుంటల కింద ఆధారపడి వ్యవసాయం చేసే రైతులకు ఈ యాసంగి సీజన్‌లో సాగు ప్రశ్నార్థకంగా మారింది.

యాసంగి ప్రణాళిక సిద్ధం

ప్రస్తుతం జిల్లాలో 70 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. డిసెంబరు రెండో వారంలో యాసంగి వరి నాట్లు ప్రారంభమవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. యాసంగిలో 3,17,380 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ ప్రణాళిక సిద్ధం చేశారు. అత్యధికంగా 2,95,200 ఎకరాల్లో వరి నాట్లు వేస్తారని, ఇందులో 1.5 లక్షల ఎకరాలు చెరువులు, కుంటల కిందనే సాగవుతుందని పేర్కొన్నారు. కానీ, జలాశయాల పరిస్థితి రైతులను కలవరపెడుతోంది.

వివిధ మండలాల్లో తీవ్ర నష్టం

మెదక్ మండలం అవుసులపల్లిలోని ఖజానా చెరువుకు భారీగా గండి పడింది. రైతులు పూడ్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేక చెరువులోని నీరంతా వృధాగా పోయింది. ఈ చెరువు కింద సుమారు వంద ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల ఈ యాసంగిలో రైతుల సాగు అనిశ్చితిలో పడింది. మెదక్ మండలం రాయిన్‌పల్లి ప్రాజెక్ట్ కాల్వ వర్షాలకు కొట్టుకుపోయింది. కాల్వ మరమ్మత్తులకు సుమారు రూ.1.20 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టాలని ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. టేక్మాల్, అల్లాదుర్గం, హవేలీఘనపురం, చిన్నశంకరంపేట, రామాయంపేట, కొల్చారం, నిజాంపేట, నర్సాపూర్, రేగోడ్, మనోహరాబాద్, వెల్దుర్తి, కౌడిపల్లి, పాపన్నపేట, శివంపేట, చేగుంట వంటి పలు మండలాల్లో చెరువులకు గండ్లు పడ్డాయి. పురాతన గొలుసుకట్టు చెరువులకు పడిన గండ్లు

మిగతా 8వ పేజీలో



మెదక్ మండలం రాయిన్‌పల్లి చెరువు కాల్వకు పడిన గండి

వైద్యం చేయకుండా 'ప్రాక్టికల్స్'

- బోధనాసుపత్రి యాజమాన్యం నిర్వాకం
- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
- ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

7

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

సంగారెడ్డి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఆదివారం జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన పరీక్షకు 1,363 మందికి 1,325 మంది హాజరయ్యారు. 97.21 హాజరు శాతం నమోదైందని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

మెదక్‌లో..

మెదక్ అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ఐదు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 894 మంది విద్యార్థులకు 881 మంది (98.55 శాతం) హాజరైనట్లు డీఈవో విజయ తెలిపారు.

హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజావాణి దరఖాస్తులు

మెదక్ అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అధికారులు స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైనందున సోమవారం నిర్వహించిన ప్రజావాణి దరఖాస్తులను హెల్ప్‌డెస్క్ ద్వారా స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.



అందోలులో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న దామోదర్ రాజనర్సింహ

మహిళలందరినీ కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి-మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి చీరల పంపిణీ కార్యక్రమం ఆదివారం అందోలు మండలం సంగుపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించారు. అందోల్, పుల్కల్, వట్‌పల్లి, చౌటకూర్ తదితర మండలాలకు చెందిన మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు అందిస్తున్న ఇందిరమ్మ చీర మహిళా ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. కోటి మంది మహిళలకు కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం అడుగు ముందుకు వేస్తుందన్నారు. ఇందిరాగాంధీ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. మహిళా సంఘాలు ఐక్యంగా ఉంటేనే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళకు డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా చేర్పించడానికి సమైఖ్య సంఘాల సభ్యులు కృషిచేయాలన్నారు. తెల్ల రేషన్‌కార్డులో పేరున్న మహిళలందరికి ఇందిరమ్మ చీరలను అందజేయాలని స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 16,164 స్వయం సహాయక సంఘాల్లోని 1,65,467 సభ్యుల అభ్యున్నతికి సెర్ప్ చేపట్టిన కార్యక్రమాలు విశేష ఫలితాలను ఇస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో సూర్యారావు, ఆర్డీవో పాండు, జిల్లా కోశాధికారి మీనా, జిల్లా సమైఖ్య ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చీరల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చేగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీలో మహిళలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. చేగుంటలోని ఐకేపీ కార్యాలయంలో (ఐరిస్) లైవ్ ఫొటోగ్రఫీ ద్వారా లబ్ధిదారులకు చీరల పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. మహిళా సంఘాలలో సభ్యులుగా ఉన్నవారందరికీ చీరలు అందేలా అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ప్రతీ గ్రామంలో చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. చీరల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రతీ మహిళకు ఐరిస్ లైవ్ ఫొటోగ్రఫీ ద్వారానే చీరలు అందించాలన్నారు. చేగుంట మండలానికి ఇప్పటి వరకు 10వేల చీరలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం దుర్గాప్రసాద్, వీవోఏలు హారిక, జ్యోతి, సరిత, గ్రామ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సమర్థంగా రిజర్వేషన్ల కేటాయింపు

చిన్నశంకరంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల సమక్షంలో ఆదివారం చేపట్టిన పంచాయతీ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల నియమావాళిపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఎంపీవో గిరిజారాణి, సీనియర్ అసిస్టెంట్ శ్రీలత, వివిధ పార్టీల నాయకులు యాదగిరి యాదవ్, రాజు, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం సత్యసాయి

మెదక్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాంతి, ప్రేమ, స్వచ్ఛమైన సేవలకు సత్యసాయి బాబా ప్రతిరూపమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బాబా శత జయంతిని పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్‌లోసత్యసాయి చిత్రపటానికి కలెక్టర్ నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సత్యసాయి ప్రేమ, ఆధ్యాత్మిక బోధనలు, సేవా కార్యక్రమాలతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భక్తుల హృదయాల్లో నిలిచారన్నారు. అనంతరం జిల్లా సత్యసాయి సేవా బృందం సభ్యులు భజన గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో రమేష్, సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు శిరిగ ప్రభాకర్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



చేగుంటలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రయాణం.. ప్రమాదం

- గుంతలమయంగా సిర్గాపూర్ రోడ్డు
- మూడేళ్లుగా నత్తనడకన విస్తరణ పనులు
- రోడ్డు తవ్వకంతో దుమ్మూ, ధూళి
- ప్రమాదాల బారినపడుతున్న వాహనదారులు

7



రెండు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

● ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి, కారు బోల్తా పడి మరో ముగ్గురికి..

పుల్కల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తానాపూర్ గ్రామ శివారులో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. మండలంలోని చక్రియాల గ్రామానికి చెందిన మినపూర్ పండరి తన ద్విచక్ర వాహనంపై సుల్తానాపూర్ వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, నానక్‌రాంగూడ ప్రాంతాలకు చెందిన సాయిసద్గురు, వెంకటప్రసాద్ టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో వెనుక వస్తున్న వారి ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ముందు వెళ్తున్న పండరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ముగ్గురికీ గాయాలయ్యాయి. అదే రహదారిపై సంగారెడ్డి వైపునకు వెళ్తున్న జోగిపేట సీఐ అనిల్‌కుమార్ ప్రమాదాన్ని గమనించారు. వెంటనే తన వాహనాన్ని నిలిపి, ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు సపర్యలు చేశారు. అనంతరం వారిని ఎన్‌హెచ్ఏఐ అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.


క్షతగాత్రుడిని అంబులెన్సులో ఎక్కిస్తున్న జోగిపేట సీఐ అనిల్‌కుమార్

కారు బోల్తాపడి..

మండల కేంద్రమైన చౌటకూర్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని బోడుప్పల్ ప్రాంతానికి చెందిన నాగరాజు, కిరణ్, శివరాం రాథోడ్‌లు కారులో నారాయణఖేడ్ వెళ్లి తిరిగి వస్తున్నారు. వారి కారు సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారిపై టీ టైం హోటల్ వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా కొట్టింది. రహదారి మధ్యలోని కాలువలోకి దూసుకుపోయి, పల్టీలు కొట్టి జోగిపేట వైపునకు వెళ్లే రహదారిపై తిరగబడింది. ఈ సంఘటనలో పై ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.


ప్రమాదానికి గురైన కారు

కుక్కను చంపాడన్న నెపంతో
వ్యక్తిపై హత్యాయత్నం

● ఐదుగురిపై కేసు నమోదు

పుల్కల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుక్కను చంపాడన్న నెపంతో ఓ వ్యక్తిపై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెండికోలు గ్రామంలో జరిగింది. ఎస్ఐ ఎన్. విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బంటు మల్లయ్య పెంపుడు కుక్క మూడు నెలల క్రితం చనిపోయింది. ఆ కుక్కను అదే గ్రామానికి చెందిన నీరుడి నర్సింలు చంపాడంటూ మల్లయ్య గొడవ పడ్డాడు. అప్పటి నుంచి ఇరు కుటుంబాలు దూరంగా ఉంటున్నారు. ఈ నెల 16న కుక్క మృతి విషయమై బంటు మల్లయ్య, నర్సింహులు ఇంటికి వచ్చి మళ్లీ గొడవ పడగా, నర్సింహులు కుమారుడు సన్నీ ఇద్దరినీ అక్కడి నుంచి పంపించేశాడు. తాజాగా శనివారం, బంటు మల్లయ్య మరదలు రేణుక, నీరుడి నర్సింహులు ఇంటి వద్దకు వచ్చి గొడవకు పాల్పడింది. ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో రేణుకకు తోడుగా ఆమె భర్త కృష్ణ, బంటు మల్లయ్య, ఆయన భార్య మల్లమ్మ, కుమారుడు మహేశ్ అక్కడికి చేరుకున్నారు. వారంతా కలిసి నర్సింలును బూతులు తిడుతూ, వీధిలో పడేసి కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడిన నర్సింహులును చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. బాధితుడు నీరుడి నర్సింహులు కుమారుడు సన్నీ ఫిర్యాదు మేరకు ఆ ఐదుగురిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆదివారం వారిని రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ ఎన్. విశ్వజన్ తెలిపారు.


ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడిన నీరుడి నర్సింహులు

విద్యుదాఘాతంతో రైతు మృతి


ఆంజనేయులు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కొండపాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన కొండపాకలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... కొండపాకకు చెందిన చేబర్తి ఆంజనేయులు (58) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న వ్యవసాయ భూమిలో ఇటీవల వరి కోయగా, మళ్లీ సాగు చేయడం కోసం పొలంలో నీళ్లు అందిస్తున్నాడు. ఆదివారం రోజు మాదిరిగా పొలం పనులకు వెళ్లి మోటార్ ఆన్ చేస్తుండగా, అనుకోకుండా విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుని కుటుంబాన్ని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి పరామర్శించి, కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

'అమ్మా.. నన్ను నలుగురు కొడుతున్నారు..'

● అనుమానాస్పదంగా యువకుడి మృతి

ములుగు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'అమ్మా నన్ను నలుగురు కొడుతున్నారు' అంటూ ఫోన్‌లో కొడుకు తెలుపగా.. అక్కడికి వెళ్లిన చూసే సరికి విగతజీవిగా పడి ఉన్నాడు. ఈ సంఘటన బస్వాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన నర్సంపల్లి సందీప్(21) శనివారం సాయంత్రం నాలుగు గంటలకు తుర్కపల్లి కంపెనీలో ఉద్యోగం ముగించుకొని ఇంటికి వచ్చాడు. అనంతరం కొత్తూరు గ్రామానికి వెళ్లి హెయిర్ కటింగ్ చేయించుకొని వస్తానని చెప్పి మోటార్ సైకిల్‌పై బయటికెళ్లి తిరిగిరాలేదు. సాయంత్రం అతని తల్లి రేణుక, సందీప్ మొబైల్‌కు కాల్ చేయగా, ఇంకా కటింగ్ అవ్వలేదని చెప్పాడు. రాత్రి 9:30 గడుస్తున్నా ఇంటికి రాకపోవడంతో కొడుకుకు మళ్లీ ఫోన్ చేయగా 'అమ్మా నన్ను కొడుతున్నారు' అని చెబుతూ ఉండగా ఫోన్ కట్ అయింది. తిరిగి సందీప్ తన తల్లికి రాత్రి 10 గంటలకు ఫోన్ చేసి 'అమ్మ కొత్తూరులోని పెద్దమ్మ గుడి వెనకాల నలుగురు వ్యక్తులు మధు, నందు, అరుణ్, అనిల్ నన్ను కొడుతున్నారని' చెప్పాడు. దీంతో వెంటనే తల్లి రేణుక కుటుంబ సభ్యులతో కలిసి కొత్తూరులోని పెద్దమ్మ గుడి వెనకాల వెతకగా అక్కడ కనిపించలేదు. కొడుకు సందీప్‌కు ఫోన్ చేస్తే ఎంతకు లిఫ్ట్ చేయలేదు. కొత్తూరు గ్రామ శివారులో రోడ్డుకు ఇరువైపులా వెతుకుతూ ఉండగా, రోడ్డుకు ఒకవైపు బండి, మరో వైపు సందీప్ పడి ఉండడాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. అప్పటికే సందీప్ మరణించి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై రఘుపతి తెలిపారు.


సందీప్(ఫైల్)

అప్పుల బాధతో కూలీ ఆత్మహత్య

దుబ్బాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో కూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన దుబ్బాక మండలం ఆకారం గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. దుబ్బాక సీఐ పి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డప్పు చంద్రం(50) ఆకారం గ్రామంలో కూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం కొన్ని అప్పులు చేసిన చంద్రం, ఇటీవల నాలుగు నెలల క్రితం అప్పులు తీర్చేందుకు ఒక ఎకరం భూమిని అమ్మాడు. వాటితో కొన్ని అప్పులు తీర్చగా, మరికొన్ని అప్పులు అలాగే మిగిలిపోయాయి. మిగిలిన అప్పుల గురించి తీవ్రంగా ఆలోచిస్తూ, తనలో తాను బాధపడుతున్న చంద్రం శనివారం రాత్రి గ్రామ శివారులో ఒక చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహానికి స్థానిక వంద పడకల ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్టు సీఐ తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్

బెజ్జంకి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సేవిస్తూ పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం రాత్రి బెజ్జంకి పోలీసు స్టేషన్‌లో సీఐ వెల్లడించారు. మండలంలోని ముత్తన్నపేటకు చెందిన కనగండ్ల అజయ్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం సోమవారంపేటకు చెందిన తడ్కపల్లి శేఖర్ బెజ్జంకి శివారులో గంజాయి సేవిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఇద్దరు గంజాయి సేవిస్తూ విక్రయిస్తుంటారని గతంలో అజయ్ గంజాయి కేసులో అరెస్టు అయి జైలుకు వెళ్లి వచ్చాడని, శేఖర్ పై ఇల్లంతకుంట పోలీసు స్టేషన్‌లో మూడు గంజాయి కేసులు ఉన్నాయని తెలిపారు. ఇద్దరి పై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీను తెలిపారు. సీఐ వెంట చిన్నకోడూరు ఎస్ఐ సైఫ్ అలీ, రాజగోపాల్‌పేట ఎస్ఐ వివేక్, బెజ్జంకి ఏఎస్ఐ శంకర్‌రావు ఉన్నారు.

కరుణామయుడికి కోత కాలపు కృతజ్ఞతార్పణ



చర్చి వేదికను వివిధరకాల పండ్లు పూలు తోరణాలతో అలంకరించిన భక్తులు

- కోత పంటలు సమర్పించిన రైతులు
- భక్తులతో కిటకిటలాడిన చర్చి పరిసరాలు

మెదక్ కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం కోత కాలపు కృతజ్ఞతార్పణల పండుగ ఘనంగా జరిగింది. దీంతో భక్తుల ప్రార్థనలతో చర్చి పరిసరాలు కిక్కిరిసిపోయాయి. క్రైస్తవులు ప్రతి ఏటా పంట చేతికొచ్చిన సమయంలో, తొలి పంట ఫలాలను దేవుడికి సమర్పించడం సంప్రదాయంగా వస్తోంది. మెదక్ చర్చిలో కోత కాలపు కృతజ్ఞతార్పణల పండుగను అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిని మామిడి తోరణాలు, అరటి చెట్లు, బంతి పూలు, సీతాఫలాలు, వివిధ రకాల పండ్లతో శోభాయమానంగా అలంకరించారు. దక్షిణ భారత సంఘం (సీఎస్ఐ) మెదక్ డయాసిస్ పరిధిలోని వివిధ జిల్లాల నుంచి క్రైస్తవులు తమ పంట ఉత్పత్తులైన పండ్లు, కూరగాయలు, వరి కంకులను తీసుకొచ్చి దేవుడికి సమర్పించారు. వాటిని చర్చి లోపల ఉన్న వేదిక వద్ద క్రమ పద్ధతిలో చూడముచ్చటగా అమర్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి బిషప్ రూబెన్ మార్క్ మాట్లాడుతూ.. ఏటా మనకు వచ్చిన పంటలలో పది శాతం దేవుడికి సమర్పించడం వలన దేవుడు మనకు అంతకంటే ఎక్కువే ప్రసాదిస్తాడని అన్నారు. ఈ పండుగలో మత గురువులు, చర్చి కమిటీ సభ్యులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి, ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల ప్రార్థనా గీతాలు అలరించాయి. భక్తులు, సందర్శకులు కుటుంబ సభ్యులతో కలిసి చర్చి ఆవరణలో విందు భోజనాలు చేస్తూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. దీంతో చర్చి పరిసరాలలోని దుకాణ సముదాయాలన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.



ప్రార్థనలో భక్తులు

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీకి సిద్దిపేట క్రీడాకారుడు ఎంపిక

- అభినందించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



అర్ఫాజ్ అహ్మద్‌ను అభినందిస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి కోల్‌కతాలో జరగనున్న బీసీసీఐ సీనియర్ మెన్స్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (టీ20) కోసం హెచ్‌సీఏ టీమ్‌కు సిద్దిపేట క్రికెట్ క్రీడాకారుడు అర్ఫాజ్ అహ్మద్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు. సిద్దిపేట క్రికెట్ స్టేడియాన్ని ఫ్లడ్‌లైట్స్‌తో అద్భుతంగా అభివృద్ధి చేశామని హరీశ్‌రావు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా కేసీఆర్ క్రికెట్ ట్రోఫీని నిర్వహించామని గుర్తుచేశారు. అంతేకాకుండా, స్టేడియం అభివృద్ధి జరిగింది కాబట్టే సిద్దిపేటలో టీ20 మ్యాచ్‌లు నిర్వహించామన్నారు. సిద్దిపేట క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎదగాలనే తపనతోనే స్టేడియాన్ని అభివృద్ధి చేశామన్నారు. సిద్దిపేట స్టేడియం నుంచి నేడు జాతీయ వేదికపై ఆడటం ఒక ప్రజాప్రతినిధిగా తనకు ఎంతో సంతోషంగా ఉందని, ఇలా ఫలితాలు వచ్చినప్పుడే చేసిన పనికి సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. అహ్మద్ మరింత రాణించాలని, భవిష్యత్తులో మరిన్ని జాతీయ మ్యాచ్‌లలో పాల్గొనాలని ఆకాంక్షిస్తూ, తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయిలో మెరిసిన మనిషా సిర్వి



మనిషా సిర్వికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

గుమ్మడిదల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన 'ఇన్‌స్పైర్ మానక్-2025' కోసం శ్రీ వివేకానంద హైస్కూల్ విద్యార్థిని మనిషా సిర్వి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిమ్ముల జైపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ చిమ్ముల లత మాట్లాడుతూ సామాజిక సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను అన్వేషించే దిశగా మనిషా రూపొందించిన వినూత్న ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికలో నిలిచిందని వారు వివరించారు. మనిషా ప్రతిభను గుర్తించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆమెకు ప్రత్యేకంగా బహుమతి ప్రదానం చేసి అభినందించారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో కూడా మనిషా ప్రతిభను చాటుకుని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల వర్గాలు ఆకాంక్షించాయి.

యూనిటీ మార్చ్‌కు రాఘవాపూర్ వాసి



రమేష్ కట్టర్

సిద్దిపేట రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న యూనిటీ మార్చ్‌కు సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన గణగోని రమేష్ కట్టర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ప్రారంభం కానున్న యూనిటీ మార్చ్ నాగ్‌పూర్, ఇండోర్ మీదుగా గుజరాత్‌లోని ఐక్యతా విగ్రహం వద్ద ముగుస్తుందని తెలిపారు. సిద్దిపేట జిల్లా నుంచి తనను ఎంపిక చేసిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యమందించకుండా 'ప్రాక్టికల్స్'

- ఎంఎన్ఆర్ ఆసుపత్రి యాజమాన్యం నిర్వాకం
- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
- ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన



సంతోష్‌కుమార్ (ఫైల్)

సంగారెడ్డి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాలలో దారుణమైన సంఘటన చోటు చేసుకుంది. 20 సంవత్సరాలుగా ఎంఎన్ఆర్‌లో పనిచేస్తున్న సంతోష్ కుమార్(45) ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. తమ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స చేస్తామని చెప్పి, యాజమాన్యం అతడిని ఎంఎన్ఆర్ ఆసుపత్రికి తరలించింది. తీవ్ర గాయాలతో ఉన్న సంతోష్ కుమార్‌కు మెరుగైన వైద్యం అందించాల్సిన వైద్యులు, వైద్య అధ్యాపకులు, వైద్య విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయించేందుకు అతడిని ఉపయోగించారని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. సంతోష్ కుమార్‌కు సరైన వైద్యం అందించకపోవడం వల్లే చనిపోయాడని, ఈ విషయాన్ని యాజమాన్యాన్ని ప్రశ్నించగా తమపై దురుసుగా ప్రవర్తిస్తూ దాడి చేసేందుకు ప్రయత్నించారని మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సంతోష్ కుమార్ కుటుంబ సభ్యులు ఎంఎన్ఆర్ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సంగారెడ్డి రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, న్యాయం జరిగేలా చూస్తామని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

ప్రయాణం.. ప్రమాదం!

- గుంతలతో అధ్వానంగా మారిన సిర్గాపూర్ రోడ్డు
- మూడేళ్లుగా నత్తనడకన విస్తరణ పనులు
- రోడ్డు తవ్వకంతో విపరీతమైన దుమ్ము, ధూళి
- ప్రమాదాల బారిన వాహనదారులు

నారాయణఖేడ్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రవాణా సౌకర్యాలు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నా, కొన్ని ప్రాంతాల్లో పనులు మాత్రం అసంపూర్తిగా నిలిచిపోయి ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. అలాంటిదే నారాయణఖేడ్-సిర్గాపూర్ రోడ్డు. రోడ్డు విస్తరణ కోసం శంకుస్థాపన చేసి మూడేళ్లు కావస్తున్నా, పనులు పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అసంపూర్తిగా వదిలేసిన పనులు

నారాయణఖేడ్ నుంచి సిర్గాపూర్ మీదుగా జాతీయ రహదారి 161కు అనుసంధానం చేసే మాసానపల్లి రోడ్డుపై సిర్గాపూర్ వరకు డబుల్ లేన్ రోడ్డుగా విస్తరించడం కోసం 2023లో అప్పటి ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు అప్పట్లో రాష్ట్ర మంత్రిగా హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మొత్తం 12 కిలోమీటర్ల దూరంలో దాదాపు 9 కిలోమీటర్లు విస్తరణ కోసం తవ్వారు. కానీ, ఆ తర్వాత పనులను పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలివేశారు.



రోడ్డు విస్తరణకోసం తవ్వి వదిలి పెట్టిన దృశ్యం




నారాయణఖేడ్-సిర్గాపూర్ రోడ్డు విస్తరణ కోసం శంకు స్థాపన చేసిన శిలాఫలకం

గోతులు, దుమ్ముతో నరకం

గతంలో సింగిల్‌గా ఉన్న బీటీ రోడ్డు కాస్తా.. కాంట్రాక్టర్ తవ్వి వదిలివేయడంతో పూర్తిగా అధ్వాన్నంగా తయారైంది. అనేక చోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతులమయమైన రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. పనులు అసంపూర్తిగా వదిలివేయడంతో రోడ్డంతా విపరీతమైన దుమ్ము వస్తుందని, ఇది వాహనదారులకు మరింత ప్రమాదకరంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు గుండానే జాతీయ రహదారికి వెళ్లడమే కాకుండా, కామారెడ్డి జిల్లాలోని పిట్లం వంటి ప్రాంతాలకు ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత సంవత్సరం నుంచి పనులను అసంపూర్తిగా వదిలివేయడంతో అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. తాజాగా, వారం రోజుల క్రితం నారాయణఖేడ్‌లోని ఓ బ్యాంకు ఉద్యోగి కూడా ఈ రోడ్డుపై ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు.

ప్రమాదకరంగా కాజ్‌వే

అంతేకాకుండా, సిర్గాపూర్ నుంచి నల్లవాగు వెళ్లే రోడ్డుపై ఉన్న లో లెవల్ కాజ్‌వే కూడా ప్రమాదకరంగా మారింది. కాజ్‌వేపై నీరు నిలవడమే కాకుండా, రోడ్డు మొత్తం గోతులు ఏర్పడడంతో రాత్రి సమయంలో కొత్తగా ప్రయాణించే వారు తప్పనిసరిగా ప్రమాదాల బారిన పడక తప్పని పరిస్థితి నెలకొంది. మూడేళ్ల క్రితం చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను కాంట్రాక్టర్ కేవలం తవ్వించి, ఉన్న రోడ్డును మరింత అధ్వాన్నంగా తయారు చేసినా, అధికారులు కాంట్రాక్టర్‌పై ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రజలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన నారాయణఖేడ్-సిర్గాపూర్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



కంకరతో రోడ్డు దుస్థితి



గుంతలమయమైన సిర్గాపూర్ రోడ్డు



నిజాంపేట మండలం బల్కాం చెల్కా తండా భవానీమాతా ఆలయం చుట్టూ నీటి కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

భక్తజనసంద్రంగా ఆలయాలు

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రముఖ ఆలయాలు ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులతో కిటకిటలాడాయి. కొమురవెల్లి మల్లికార్జున స్వామి, నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి, వర్గల్ విద్యా సరస్వతి అమ్మవారి క్షేత్రాలకు భక్తులు భారీగా తరలివచ్చారు.



విద్యాధరి క్షేత్రంలో చిన్నారులకు సామూహిక అక్షర స్వీకారాలు..

కొమురవెల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి సన్నిధి ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. భక్తులు ఆలయ ముఖ మండపంలో, గంగిరేగి చెట్టు వద్ద పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొని, అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. వారు బండారు, పట్టు వస్త్రాలు సమర్పించి తమ కోరికలు ఈడేర్చమని వేడుకున్నారు. విజయాచల గుట్టపై ఉన్న ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లను కూడా దర్శించుకుని ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు, మొక్కులు చెల్లించుకున్నారు. బెల్లం, కల్లు శాక సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి టంకశాల వెంకటేష్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సత్యసాయి సంజీవని ఆసుపత్రి (కొండపాక) ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

- వర్గల్ : వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికంగా ఉండటంతో స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించారు. అలాగే వర్గల్ విద్యాధరి క్షేత్రంలో మూల నక్షత్ర మహోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం వేద పండితుల వేద మంత్రోచ్ఛరణలతో మూల నక్షత్ర పూజలు ప్రారంభించారు.
- కల్హేర్ : నిజాంపేట మండలం బల్కంచెల్కా తండాలోని విశ్వపాలిని జ్వాలాముఖి భవానీమాతా సమేత సేవాలాల్ మహారాజ్ ఆలయ 13 వ వార్షికోత్సవాలు ఆదివారం కనుల పండువగా జరిగాయి. ఆలయ ధర్మకర్త, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్ సింగ్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవం, సహస్ర నీటి కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి, ఆల్ ఇండియా సాధు, సంతుల తెలంగాణ ప్రతినిధి సంగ్రామ్ మహారాజ్ ప్రవచనం చేశారు.
- కోహెడ : కోహెడ మండలం కూరెళ్ల, తంగెళ్లపల్లి, గుండారెడ్డిపల్లి గ్రామాల మధ్య మోయ తుమ్మెద వాగు ఒడ్డున గల సింగరాయకొండలో జరిగే ప్రతాపరుద్ర సింగరాయ జాతర ప్రాంతాన్ని ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అభిలాష్‌లు ఆదివారం పరిశీలించారు. ఈ జాతర ప్రాంతంపై తంగళ్లపల్లి, కూరెళ్ల గ్రామాల మధ్య సరిహద్దు వివాదం గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. జనవరిలో జరగనున్న జాతర నిర్వహణపై పోలీసులు ముందస్తుగా కసరత్తు చేపట్టారు.



గంగిరేగి చెట్టు వద్ద భక్తుల కోలాహలం

క్రైం కార్నర్

రైతులను మోసం చేస్తున్న ఇద్దరికి రిమాండ్



నిందితులు శ్రీనివాస్, రజనీకర్ రెడ్డి

కోహెడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒక సర్వే నంబర్‌లో అక్రమ రిజిస్ట్రేషన్‌పై అందిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన రాగుల తిరుపతి అలియాస్ రాగుల శ్రీనివాస్, బట్టు రజనీకర్‌రెడ్డిలు కోహెడ గ్రామానికి చెందిన గూళ్ల బాలయ్యను మోసం చేశారు. గత 50 సంవత్సరాల క్రితం కోహెడ శివారులోని వింజపల్లి రోడ్డులో ఉన్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిని బాలయ్య తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి దగ్గర సాదా బైనామా ద్వారా కొనుగోలు చేశారు. అయితే, ఈ ఇద్దరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా మోసం చేసి ఒక్కొక్కరు ఒక ఎకరం చొప్పున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ విషయంపై బాలయ్య కుమారుడు చంద్రశేఖర్ సీపీ విజయకుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అభిలాష్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇది అక్రమ రిజిస్ట్రేషన్ అని తేలడంతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

23 మంది బాధితుల ఫిర్యాదు...

ఈ విషయం వెలుగులోకి రావడంతో మరికొంత మంది బాధితులు కోహెడ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేస్తున్నారు. దాదాపు 23 మందికి పైగా ఫిర్యాదులు చేయడంతో ఈ ఇద్దరు వ్యక్తులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల వద్ద 83 డాక్యుమెంట్లు లభ్యం కావడంతో సమగ్ర విచారణ చేస్తున్నట్లు ఏసీపీ సదానందం తెలిపారు.

దాడి కేసులో ఇద్దరికి..



దాడి చేసిన కేసులో అరెస్టయిన వ్యక్తులను చూపుతున్న పోలీసులు

బెజ్జంకి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి పై దాడి చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వడ్లూరు గ్రామానికి చెందిన అన్నాడి సాయిరెడ్డి, అతడి స్నేహితుడు శ్రీమాన్‌ను అదే గ్రామానికి చెందిన నల్వాల శ్రీనివాస్, పైడిపాల మల్లేశం విచక్షణ రహితంగా కొట్టి కారు అద్దాలు ధ్వంసం చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనివాస్, మల్లేశంను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీను తెలిపారు. సీఐ వెంట చిన్నకోడూరు ఎస్ఐ సైఫ్ అలీ, రాజగోపాల్‌పేట ఎస్ఐ వివేక్, బెజ్జంకి ఏఎస్ఐ శంకర్‌రావు ఉన్నారు.



జహీరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన చీరల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్


రామాయంపేటలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు


ఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను సబ్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళాశక్తి చీరల పంపిణీకి హాజరై మాట్లాడారు. అలాగే రామాయంపేట, నిజాంపేట, పాపన్నపేటలో ఎమ్మెల్యే రోహిత్‌రావు, నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సబ్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి చీరలు పంపిణీ చేశారు. అలాగే పెద్దశంకరంపేట, మనోహరాబాద్, మాసాయిపేట, చిన్నశంకరంపేట మండలాల్లో కూడా చీరల పంపిణీ జరిగింది.

- న్యూస్ నెట్‌వర్క్

కడగండ్లు

(5వ పేజీ తరువాయి)

సకాలంలో పూడ్చకపోవడం వల్ల వరుసగా పలు చెరువుల కట్టలు తెగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

63 చెరువులకు రూ.44కోట్ల ప్రతిపాదనలు

వానాకాలం సీజన్‌లో తీవ్రస్థాయిలో దెబ్బతిన్న చెరువులను జిల్లా ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 63 చెరువులకు నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు. మెదక్ 2, హవేలీఘనపూర్ 6, రామాయంపేట 2, నిజాంపేట 5, కొల్చారం 1, కౌడిపల్లి 6, చిలప్‌చెడ్ 4, చేగుంట 2, వెల్దుర్తి 1, చిన్నశంకరంపేట 3, నర్సాపూర్ 10, శివంపేట 6, తూప్రాన్ 2, మనోహరాబాద్ 4, అల్లాదుర్గం 3 చెరువులకు నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు. మరమ్మతులకు రూ.44 కోట్లు వ్యయం అవుతుందని జిల్లా ఇరిగేషన్‌శాఖ అంచనావేసి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు మంజూరు చేయకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు వేసిన తర్వాత మధ్యలో నీటి సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఉందని రైతులు భయపడుతున్నారు. చెరువులు పటిష్ఠంగా ఉండేలా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

అమర్‌సేనారెడ్డికి 'సర్వే' పరామర్శ

నిజాంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో పయోసిల్ శస్త్ర చికిత్స చేయించుకున్న సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు అమర్‌సేనారెడ్డిని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ ఆదివారం సాయంత్రం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

విశ్వేశ్వర్‌కు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శ

చేగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) చేగుంట మండలం మక్కరాజుపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు విశ్వేశ్వర్ తండ్రి నాగచంద్రప్ప ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదివారం మక్కరాజుపేటలోని తన నివాసంలో విశ్వేశ్వర్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ కుమ్మరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీసీసీబీ అధ్యక్షురాలిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

మనోహరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : డీసీసీబీ అధ్యక్షురాలిగా తూంకుంట ఆంక్షారెడ్డిని నియమించిన విషయం తెలిసిందే. ఆదివారం కాంగ్రెస్ మనోహరాబాద్ మండల నాయకుడు, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి ఆంక్షారెడ్డిని గజ్వేల్‌లోని ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. గతంలో తండ్రి తూంకుంట నర్సారెడ్డి సిద్దిపేట డీసీసీబీ అధ్యక్షుడిగా ఉండగా.. ప్రస్తుతం కూతురుకు దక్కడంతో కాంగ్రెస్ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

క్రీడలతో క్రమశిక్షణ

గుమ్మడిదల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరువు నియోజకవర్గంలోని భానూరులో ఆర్‌కే క్లబ్ నిర్వహించిన 'ఓపెన్ టు ఆల్' అండర్-14వ బాలికల క్రీడా విభాగంలో గుమ్మడిదల మండలం అన్నారం గ్రామానికి చెందిన స్పార్టెన్స్ టీమ్ మొదటి బహుమతి సాధించింది. ఆదివారం కోచ్‌లు సంపత్, మల్లేశంతో పాటు విద్యార్థులు, స్పార్టెన్స్ టీమ్ సభ్యులు సీజీఆర్ ట్రస్టు కార్యాలయంలో గోవర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అమ్మగారి సదానందరెడ్డి, కొత్తపల్లి మల్లేష్ గౌడ్, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం

సంగారెడ్డి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డులో గల శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయం అభివృద్ధికి విష్ణువర్ధన్‌రెడ్డి, జిట్టే రవీందర్ గురుస్వాములు రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని సంగారెడ్డిలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీశైలం గురుస్వామికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా గురుస్వామి శ్రీశైలం మాట్లాడుతూ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం షెడ్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు పరమేశ్వర్‌గౌడ్, తిరుపతి రెడ్డి, గోపాల్, మాణిక్యరెడ్డి, వెంకన్న, విశ్వనాథరావు పాల్గొన్నారు.

శిథిలావస్థలో విద్యుత్‌శాఖ ఏఈ కార్యాలయం


శిథిలావస్థకు చేరిన విద్యుత్‌శాఖ ఏఈ కార్యాలయం

కోహీర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కోహీర్‌లోని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీరింగ్(ఏఈ) కార్యాలయం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడో నిర్మించిన కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో చేసేదేమీ లేక విద్యుశాఖ ఇన్‌చార్జి ఏఈ తన కార్యకలాపాలను కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గల సబ్‌స్టేషన్ నుంచి నిర్వహిస్తున్నారు. దీంతో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కోహీర్ సబ్‌స్టేషన్‌కు వచ్చే రైతులకు, ప్రజలకు నిరాశే ఎదురవుతుంది. ఏఈ అందుబాటులో ఉండకపోవడం వల్ల విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం రైతులు, ప్రజలు మండల కేంద్రమైన కోహీర్ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న దిగ్వాల్ గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో డబ్బులు, సమయం వృథా అవుతోంది. అంతేకాకుండా మండల కేంద్రమైన కోహీర్‌లో నిత్యం విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఏర్పడుతుంది. కోహీర్‌లో ఉండాల్సిన విద్యుత్‌శాఖ ఏఈ కార్యాలయం దిగ్వాల్‌లోని సబ్‌స్టేషన్ ఉండడం ఏమిటని మండల ప్రజలు, రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కోహీర్‌లో నూతన విద్యుత్‌శాఖ ఏఈ భవనాన్ని నిర్మించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

యువకులు ఆలయాల సందర్శన అలవాటు చేసుకోవాలి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


సత్యసాయిబాబా ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : యాంత్రికంగా మారుతున్న జీవన విధానంలో యువకులు నిత్యం ప్రార్థనామందిరాల సందర్శనను అలవాటుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు సాయిగణేష్ కాలనీలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌తో కలిసి పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గవ్యాప్తంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆలయాల నిర్మాణాలు పెరుగుతున్నాయని చెప్పారు. అనంతరం శాంతినగర్ కాలనీలోని పుట్టపర్తి సత్యసాయిబాబా ఆలయంలో జరుగుతున్న సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయడానికే సైన్స్ ఫెయిర్

- ఎస్టీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు


నిజాంపేట విద్యార్థులు రూపొందించిన గణితం ప్రాజెక్టును చూపుతున్న శ్రీనివాస్‌రావు

నారాయణఖేడ్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడం కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైన్స్ ఫెయిర్లు నిర్వహిస్తున్నాయని ఎస్టీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. నిజాంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనలో గణితం, పర్యావరణాలకు సంబంధించి 7వ తరగతి విద్యార్థి హరీష్, గణితానికి సంబంధించి ఏ తేదీ అయినా, వారమైనా క్షణాల్లో చెప్పేస్తానంటూ ప్రాజెక్టును తయారు చేశాడని, ఈ ప్రాజెక్టు ఆకట్టుకుందన్నారు. పదో తరగతి విద్యార్థులు ధ్రువకుమార్, యశ్వంత్, రోహిత్ చంద్రయాన్ ప్రాజెక్టును, 8వ తరగతి విద్యార్థి అరుణ్, ఇన్సులేటర్ ప్రాజెక్టును, 9వ తరగతి విద్యార్థి రాహుల్ రూపొందించిన నీటి శుద్ధి యంత్రం ప్రాజెక్టులకు చక్కటి స్పందన వచ్చిందన్నారు. నిజాంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన నాలుగు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయని భారతి, విజయ్‌కుమార్‌తో కలిసి అభినందించారు.

పలు మండలాల్లో సత్యసాయిబాబా శతజయంతి


సంగారెడ్డి క్రైం : సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

సంగారెడ్డి క్రైం/నారాయణఖేడ్/వెల్దుర్తి/చేగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతిని సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి డీఎస్పీ సత్తయ్యగౌడ్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు రమేష్, ఆర్ఐ రామారావు పాల్గొన్నారు. నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం సత్యసాయిబాబా జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. చేగుంట మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివప్రసాద్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చిన్నారెడ్డి సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, జూనియర్ అసిస్టెంట్ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో మొదలైన ఎన్నికల సందడి

- సర్పంచ్, వార్డుసభ్యుల రిజర్వేషన్లు ఖరారు


కంది ఎంపీడీవో కార్యాలయంలో వివిధ పార్టీల నాయకుల సమక్షంలో వార్డుసభ్యుల రిజర్వేషన్లను డ్రా తీస్తున్న అధికారులు

కంది, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం వార్డుసభ్యుల ఖరారు కోసం ఎంపీడీవో ఆయా పార్టీల నాయకుల సమక్షంలో రిజర్వేషన్లను డ్రా పద్ధతిలో ఖరారు చేశారు. కంది మండలంలో 212 వార్డుసభ్యులకుగాను 127 జనరల్, 87 మహిళలకు కేటాయించారు. ఇందులో ఎస్టీ 33 మంది వార్డుసభ్యులు ఉండగా.. 19 మంది పురుషులు, 14 మంది మహిళలకు కేటాయించారు. అలాగే ఎస్సీ 37 వార్డుసభ్యులు ఉండగా.. అందులో 25 పురుషులకు, 12 మహిళలకు కేటాయించారు. బీసీల్లో 48 వార్డుసభ్యులు ఉండగా.. అందులో 29 పురుషులకు, 19 మహిళలకు కేటాయించారు. అలాగే జనరల్‌లో 94 వార్డు సభ్యులు ఉండగా అందులో 52 పురుషులకు, 42 మహిళలకు కేటాయించారు. అనంతరం సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు చేశారు.

తూప్రాన్: తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆదివారం ఆర్డీవో జయచంద్రారెడ్డి సమక్షంలో డివిజన్‌లోని తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి, మాసాయిపేట, చేగుంట, నార్సింగి మండలాల రిజర్వేషన్లు ఖరారు చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో రిజర్వేషన్లు ఖరారు కావడంతో డ్రా పద్ధతిలో మహిళా రిజర్వేషన్లు ఖరారు చేశారు. తూప్రాన్ మండలంలో 14 గ్రామపంచాయతీల్లో రిజర్వేషన్లు ఖరారు చేశారు.

నర్సాపూర్: నర్సాపూర్ మండలంలోని 34 పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు రిజర్వేషన్లను ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మహిపాల్, ఆయా రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఖరారు చేశారు. నర్సాపూర్ మండలంలో 34 పంచాయతీలు ఉండగా.. అందులో అన్‌రిజర్వ్ గ్రామపంచాయతీలు 16 ఉన్నాయి. బీసీలకు 6, ఎస్సీలకు 5, ఎస్టీలకు 9 చొప్పున రిజర్వేషన్ కల్పించారు.

చేగుంట: చేగుంట మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా వార్డు స్థానాలను పారదర్శకంగా డ్రా ద్వారా ఖరారు చేశారు.

పెద్దశంకరంపేట: మహిళా రిజర్వేషన్ల కోసం పెద్దశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఎంపీడీవో షాకీర్‌అలీ ఆధ్వర్యంలో పార్టీల నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుసభ్యులకు రిజర్వేషన్ల కోసం డ్రా తీశారు.

జహీరాబాద్: జహీరాబాద్‌లోని ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం ఆర్డీవో దేవూజీ, అధికారుల సమక్షంలో లాటరీ పద్ధతిలో సర్పంచ్ రిజర్వేషన్లను తీశారు. జహీరాబాద్, ఝరాసంగం, కోహీర్, రాయికోడ్, న్యాల్‌కల్ మండలాలకు సంబంధించిన రిజర్వేషన్లను ఖరారు చేశారు.

వెల్దుర్తి : వెల్దుర్తిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఉదయం ఎంపీడీవో ఉమాదేవి ఆధ్వర్యంలో డ్రా నిర్వహించారు. ఎస్సీ, బీసీ మహిళా స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లను ఎంపీడీవో ఖరారు చేశారు. మొత్తం 23 గ్రామపంచాయతీలు, 200 వార్డులు ఉన్నాయి. డ్రాలో 73 వార్డులకు మహిళా రిజర్వేషన్లు ఖరారైనట్లు ఎంపీడీవో తెలిపారు.

మనోహరాబాద్ : మండలంలో 17 గ్రామపంచాయతీలకు సర్పంచ్ రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు ఎంపీడీవో రవిందర్ తెలిపారు.

మాసాయిపేట: మాసాయిపేట మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఎంపీడీవో విఘ్నేశ్వర ఆధ్వర్యంలో 13 గ్రామపంచాయతీలకుగాను 106 వార్డులకు రిజర్వేషన్లను ఖరారు చేశారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

పాపన్నపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : యువతలో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించడంలో ఎన్‌సీసీ ప్రముఖ పాత్ర పోషిస్తుందని పాపన్నపేట ఎన్‌సీసీ అధికారి శ్రవణ్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడేట్లతో మార్చ్‌ఫాస్ట్‌తో పాటు ప్రతిజ్ఞ చేయించారు. ప్రతీ నవంబరు చివరి ఆదివారం ఎన్‌సీసీ డే జరుపుకుంటున్నట్లు ఆయన వివరించారు.

ఎయిడ్స్ కౌన్సిలర్ కంట్రోల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా రాజేశ్వర్


రాజేష్

మెదక్ కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఎయిడ్స్ కౌన్సిలర్ కంట్రోల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా మెదక్ జిల్లాకు చెందిన కాముని రాజేశ్వర్ ఎన్నికయ్యారు. శనివారం అర్ధరాత్రి వరకు జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాజేశ్వర్ ఏకగ్రీవంగా ఎనుకున్నారు. రాజేశ్వర్ ప్రస్తుతం మెదక్ జిల్లా జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. గతంలో మెదక్ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీలో చురుకుగా పాల్గొనడం వల్ల రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేసినట్టు రాష్టవర్గ సభ్యులు తెలిపారు. రాజేశ్వర్ ఎంపిక పట్ల జిల్లా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

అందోలు స్టేజీలో అన్ని ఆర్టీసీ బస్సులు ఆపాలి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా అందోలు ఆర్టీసీ బస్టాండ్‌లో కొన్ని బస్సులు ఆపడం లేదని స్థానికులు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అందోలు స్టేజీలో బస్సులు ఆపకపోవడంతో చుట్టుపక్కల ఏడు గ్రామాల ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఆర్టీసీ సంస్థ దృష్టిలో అందోలు ఆర్టీసీ స్టేజీ కనుమరుగవుతుందా అనే సందేహాలను గ్రామస్థులు వ్యక్తం చేశారు. స్వయాన మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోలు నియోజకవర్గంలోని అందోలు బస్టాండ్‌లో బస్సులు నిలపకపోవడం దారుణమన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇత్తడితో తయారుచేసిన ఫొటో అందజేత


ఇత్తడితో తయారుచేసిన సత్యనారాయణరావు ఫొటోను హరీశ్‌రావుకు అందజేస్తున్న బాలగోని సాయిచరణ్‌గౌడ్

పటాన్‌చెరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ యువ నాయకుడు బాలగోని సాయిచరణ్‌గౌడ్ మాజీ మంత్రి హరీశ్‌రావును ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఇత్తడితో తయారుచేసిన హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు ఫొటోను అందజేసి, సత్యనారాయణరావు చిత్రపటానికి నివాళులర్పించారు.


తూప్రాన్‌లో మహాపడిపూజ

- హాజరైన సీఎం సోదరులు, మైనంపల్లి హనుమంతరావు


అయ్యప్పస్వామి మహాపడి పూజలో సీఎం సోదరులు, హనుమంతరావు

తూప్రాన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం మహాపడిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కావేరిగారి వెంకటరెడ్డి గురుస్వామి అయ్యప్పస్వామి పడిపూజ చేపట్టారు. తూప్రాన్ పట్టణ అయ్యప్ప ఆలయంలో నిర్వహించిన మహాపడిపూజకు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి సోదరులు కొండల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు విక్రమ్‌రెడ్డి, చిట్కుల్ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సంగారెడ్డి చేరుకున్న 'అయ్యప్ప'ల పాదయాత్ర బృందం


సంగారెడ్డిలో విజయ సంకేతం చూపుతున్న అయ్యప్పస్వాములు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి నుంచి అక్టోబరు 6న సాహితిరాము గురుస్వామి ఆధ్వర్యంలో శబరిమలకు బయలుదేరిన అయ్యప్పస్వాముల మహా పాదయాత్ర బృందం తిరిగి సంగారెడ్డి చేరుకున్నది. సంగారెడ్డి నుంచి తిరుపతి, కాణిపాకం, అరుణాచలం మీదుగా శబరిమలకు సుమారు 1,600 కి.మీ పాదయాత్ర చేసి వచ్చిన అయ్యప్పస్వాముల బృందానికి ఘన స్వాగతం లభించింది. అయ్యప్పస్వాముల కుటుంబసభ్యులు, బంధుమిత్రులు స్వాముల కాళ్లు కడిగి హారతులు ఇచ్చి అభయాంజనేయస్వామి ఆలయం నుంచి నవరత్నాలయం వరకు స్వాగతం పలికారు.

రామంతాపూర్ మాజీ సర్పంచ్‌కు ప్రతిభా పురస్కారం


గవర్నర్ నుంచి పురస్కారం అందుకుంటున్న గోపీనాయక్

మాసాయిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలం రామంతాపూర్‌తండా మాజీ సర్పంచ్ గోపీనాయక్‌కు ఉత్తమ ప్రతిభా పురస్కారం దక్కింది. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఇందులో 8 ఈశాన్య రాష్ట్రాల కళాకారులు పాల్గొని వివిధ కళారూపాలను ప్రదర్శించారు. గోపీనాయక్ కూడా పాల్గొని రంగుల అద్దకంలో ప్రతిభ చూపారు. దీంతో శనివారం తెలంగాణ గవర్నర్ విష్ణుదేవవర్మ నుంచి ప్రశంసాపత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ అవార్డు అందుకున్న గోపీనాయక్‌ను తండావాసులు, పలువురు ప్రశంసించారు.

గొలుసుకట్టు చెరువుల ఆయకట్టు అభివృద్ధికి చర్యలు

- రెండో విడతలో 1,400 ఇందిరమ్మ గృహాలు
- ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- బాచేపల్లి, మునిగేపల్లిలో ఇందిరమ్మ గృహాల ప్రారంభం


నిజాంపేట మండలం బాచేపల్లిలో ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ నియోజకవర్గంలోని గొలుసుకట్టు చెరువుల ఆయకట్టు అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి, మునిగేపల్లిలో ఆదివారం ఇందిరమ్మ గృహాలను ప్రారంభించిన అనంతరం బాచేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.22 లక్షలతో నిర్మించే పీఎంశ్రీ సైన్స్ ల్యాబ్‌కు భూమిపూజ చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మిషన్ కాకతీయ పథకం సక్రమంగా చేపట్టకపోవడంతో చెరువులు బాగు కాలేవని, గొలుసుకట్టు చెరువుల అభివృద్ధిని పట్టించుకోలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. నారాయణఖేడ్ మండలం అబ్బెంద గ్రామం చెరువు నుంచి గంగాపూర్, తుర్కపల్లి, సంజీవన్‌రావ్‌పేట, నిజాంపేట మండలంలోని నాగ్‌ధర్, బాచేపల్లి వరకు ఒకే కాలువ ఉందని దీని ద్వారా గతంలో నీటి పరఫరా జరగటంతో ఇన్ని గ్రామాల రైతులకు ప్రయోజనం కలిగేదని తెలిపారు. ఈ కాలువ మరమ్మతు పనుల కోసం నిధులు మంజూరు చేయించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజవర్గానికి మంజూరైన ఇందరమ్మ గృహాల్లో 60 శాతం గృహాలు నిర్మాణం జరుగుచున్నాయని, కొందరికి 3వ లెవల్‌లో పేర్లు పడిన అర్హులైన వారిని గుర్తించి బిల్లులు ఇప్పిస్తామన్నారు. ఇంకా నియోజకవర్గానికి రెండో విడతలో మరో 1,400 ఇందిరమ్మ గృహాలు మంజూరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్ గౌడ్, మాజీ ఎంపీపీ మల్లేశం, నాయకులు ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్‌నాయక్, శ్రీకాంత్, సుదర్శన్, ఎర్ర రవి, నర్సింలు, సత్యనారాయణ, చరణ్ పాల్గొన్నారు.